క్లుప్తంగా

వైభవంగా జ్యేష్టాభిషేక మహోత్సవం



సూర్యనారాయణస్వామి పూజల్లో పాల్గొన్న ప్రముఖులు

ఉరవకొండ: మండలంలోని బూదగవి గ్రామంలో వెలసిన సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం జ్యేష్టాభిషేక మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రమణ్యం కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు. అలాగే శ్రీకృష్ణదేవరాయల మునిమనవడు 19వ తరానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. వీరితో పాటు ఆలయాన్ని వెలుగులోకి తెచ్చి జీర్ణోద్ధారణ చేసిన కాశీభట్ల అనంతరామశర్మ పాల్గొన్నారు. ముఖ్య అతిథులను ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు చిరంజీవి, మహేంద్ర, కృష్ణమోహన్ తదితరులు ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేసారు. పర్వదినం సందర్భంగా భక్తులు తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు.

హరిజన ఉద్యోగుల కమిటీ ఏర్పాటు



హరిజన ఉద్యోగుల కమిటీ సభ్యులు

ఉరవకొండ: తాలూకా హరిజన ఉద్యోగుల నూతన కమిటీని ఆదివారం పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ డేవిడ్, ఉపాధ్యక్షులుగా డిప్యూటీ తహసీల్దార్ నరేష్, ఉద్యోగులు చంద్రశేఖర్, మల్లికార్జున, ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శులుగా దుర్గాప్రసాద్, ఐటీఐ ఎల్లప్ప, సహాయ కార్యదర్శిగా గంగన్న, వెలుగు చంద్రశేఖర్, ట్రెజరర్లుగా జగదీష్, నాగన్న, కోర్ కమిటీ సభ్యులుగా తిప్పయ్య, ఎర్రిస్వామి, ఓబులేసు, రామకృష్ణ, గోపాల్, ఆనందరాజు ఎన్నికయ్యారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు వద్ద గ్రామస్తులు

విడపనకల్లు: మండలంలోని కడదరబెంచి గ్రామంలో హరిజన లాలెప్పకు చెందిన ఎద్దు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఎల్లమ్మ దేవాలయం వద్ద ఎల్‌టీ విద్యుత్ లైన్ వైరు తెగిపోయిందని, వారం రోజులుగా విద్యుత్ అధికారులకు చెబుతున్నా పట్టించుకోక పోవడంతో ఆదివారం విద్యుత్ షాక్‌కు గురై రూ.లక్ష విలువ చేసే ఎద్దు మృత్యు వాత పడిందని సర్పంచు కురబ ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు కురబ దేవరాజు వాపోయారు. వాపోయారు. ఏమాత్రం ఆదమరిచినా కూడా మనుషులప్రాణాలు పోయేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం ఇచ్చి బాధిత రైతును ఆదుకోవాలని సర్పంచు కోరారు.

బైకు బోల్తా.. ఇద్దరికి గాయాలు





గాయపడిన దొమ్మర తిమ్మప్ప, సిద్దార్థ

కళ్యాణదుర్గం: శెట్టూరు మండలం బచ్చేహళ్లి–చెర్లోపల్లి సమీపంలోని నల్లగుట్ట వద్ద బైకు బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... దుద్దేకుంట గ్రామానికి చెందిన దొమ్మర తిమ్మరాజు మేనల్లుడు సిద్దార్థను ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని శెట్టూరు మండలం లక్ష్మంపల్లికి బయలుదేరాడు. నల్లగుట్ట వద్దకు రాగానే బైకు అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో తిమ్మరాజుకు తలకు బలమైన గాయాలయ్యాయి. సిద్దార్థకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. శెట్టూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యర్రంపల్లి వద్ద..

కళ్యాణదుర్గం: మండలంలోని యర్రంపల్లి వద్ద బైకు అదుపు తప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. రమేష్, ఈరన్న యర్రంపల్లి నుంచి కళ్యాణదుర్గం వైపు వస్తుండగా ద్విచక్ర వాహనం బోల్తా పడింది. వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై ఎలాంటి సమాచారం అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

బొమ్మనహాళ్: ఏరువాక పౌర్ణమి వేడుకల్లో భాగంగా ఆదివారం మండలంలోని శ్రీధరఘట్ట, ఉంతకల్లు, లింగదహాళ్, కృష్ణాపురం తదితర గ్రామాల్లో వృషభాలు ఊరేగింపు నిర్వహించారు. రైతులు వృషభాలను రంగులతో అలంకరించి నైవేద్యాలు సమర్పించారు. ఆలయాలకు వెళ్లి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. డప్పుల చప్పుళ్లతో ఊరు వాకిలి నుంచి ఊరేగింపు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని దేవుళ్లకు మొక్కుకున్నారు. ఊరేగింపులో గెలుపొందిన వృషభాలకు బహుమతులు ప్రదానం చేశారు.



బొమ్మనహాళ్: ఉంతకల్లులో వృషభాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



కణేకల్లు: నాగలిపట్టి దుక్కి చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

జగనన్న పాలనలో అంతా సుభిక్షం: విప్ కాపు

కణేకల్లు: జగనన్న పాలనలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులంతా సుభిక్షంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. కణేకల్లు మండలంలోని సొల్లాపురం గ్రామంలో ఆదివారం ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రైతులతో కలసి విప్ ఏరువాక పౌర్ణమిని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఎద్దులు, నాగలికి ప్రత్యేక పూజలు చేసి టెంకాయలు కొట్టి వ్యవసాయ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో తీవ్రమైన కరువుతో రైతులు విలవిలాడిపోయారన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొలువుదీరాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విత్తు నుంచి పంట ఉత్పత్తుల విక్రయం వరకూ రైతుల చేయిపట్టుకొని నడిపిస్తున్నాడన్నారు. ఏటా మాదిరిగా ఈసారి కూడా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి అన్నదాతలు సుఖసంతోషాలతో ఉండాలని ముక్కోటి దేవుళ్లను ఆయన వేడుకొన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రవణ్‌కుమార్, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, రాకెట్ల అశోక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, జయచంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విత్తుకు సిద్ధం

కూడేరు: ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారం కింద వేరుశనగ, ఆముదం, కంది ఇతర పంటలను విత్తడానికి మండలంలోని రైతులు నేలను సన్నద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ట్రాక్టర్‌తో నేలను దుక్కి చేయిస్తున్నారు. మండలంలో వేరుశనగ సాగు సాధారణ విస్తీర్ణం సుమారు 30 వేల ఎకరాలు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగను రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీ చేస్తోంది. వేరుశనగ పొందిన రైతులు విత్తనాలను వేరు చేసే పనిలో ఉన్నారు. వర్షం రాగానే వేరుశనగ విత్తనం వేస్తామని రైతులు పేర్కొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

కుందుర్పి: మహిళలు స్వశక్తి, ఐక్యతతో ఆర్థిక పురోగతి సాధించాలని మహిళా హక్కుల ఉద్యమకారిణి భానుజ, ఎస్కే చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు సూచించారు.ఆదివారం కుందుర్పిలో అభయ ఫౌండేషన్, ఎస్కే చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని వారు సందర్శించి శిక్షణలో ఉన్న పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ న్యాయవాది ఆదెన్న మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌కే ఆంజనేయులు జ్ఞాపకార్థం తనయుడు లెనిన్‌బాబు మండలంలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన ఎంపీ బ్రిడ్జిభూషన్‌ను పదవి నుంచి తప్పించాలని మహిళలు డిమాండ్ చేశారు. అంతకుముందు మండలంలోని 16 గ్రామాల్లో ట్రస్టు పర్యవేక్షణలో నిర్వహిస్తున్న విలువల బడి వేసవి శిబిరాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మీనా, ఉమాదేవి, సావిత్రమ్మ, శ్రీకాంత్, దిలీప్,శిక్షకురాలు అంబుజా తదితరులు పాల్గొన్నారు.

నీలగిరిస్వామికి ప్రత్యేక పూజలు

వజ్రకరూరు: మండలకేంద్రంలోని నీలగిరిస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు.

ఆల్ ఫ్రీ బాబును నమ్మొద్దు

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో విప్ కాపు

కణేకల్లు: అధికారం కోసం అలవిగాని హామీలిస్తున్న ఆల్ ఫ్రీ బాబును నమ్మొద్దని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సూచించారు. 2014 ఎన్నికల్లో 650 హామీలిచ్చిన చంద్రబాబు ఈ సారి సీఎం పదవిపై ఉన్న వ్యామోహంతో రెట్టింపు హామీలిచ్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. బాబును నమ్మితే తినే కంచంలో మట్టి వేసుకున్నట్లేనన్నారు. కణేకల్లు మండలంలోని సొల్లాపురం గ్రామంలో ఆదివారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, సోమలింగారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డితో కలసి విప్ ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్ పంపిణీ చేశారు. విప్ మాట్లాడుతూ మోసగాడైన చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. మళ్లీ 2024 ఎన్నికల కోసం ప్రజలను వంచించేందుకు మేనిఫెస్టో విడుదల చేయడం హాస్యాస్పందంగా ఉందన్నారు. మేనిఫెస్టోకు ఏనాడైనా విలువ ఇచ్చావా? అంటూ చంద్రబాబును కాపు ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌తో సామానంగా భావించి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చారన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం జగనన్న కావాలా? మాయమాటలు చెప్పి నట్టేట ముంచే చంద్రబాబు కావాలో ఆలోచించుకోవాలని ప్రజలకు సూచించారు. సంక్షేమ పథకాల అమలులో అర్హులందరికీ న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, ఎంపీటీసీ కేశవరెడ్డి, సర్పంచులు ఫణీంద్రగౌడ్, తిప్పారెడ్డి, నాయకులు ప్రకాష్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, శ్రీధర్, కెనిగుంట రామిరెడ్డి, వేమన, సురేష్‌రెడ్డి, హనుమంతరెడ్డి, అంబాపురం భాస్కర్‌రెడ్డి, గొని శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

జీడిపల్లి ముంపు బాధితులను ఆదుకోండి

బెళుగుప్ప: జీడిపల్లి ముంపు బాధితులను ఆదుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి వినతిప్రతం అందజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి చేసుకోవడంతో ఆదివారం కళ్యాణదుర్గంలో నిర్వహిస్తున్న విజయోత్సవ సభకు వెళ్లున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి మండలంలోని కాలువపల్లి వద్ద స్థానిక సర్పంచ్ ఎండీ పెద్దన్న, మాజీ సర్పంచ్ తిమ్మన్న, జీడిపల్లి గ్రామస్తులు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డితో కలసి ఘనస్వాగతం పలికారు. అనంతరం మండల స్థితిగతులను ఇన్‌చార్జ్ మంత్రికి మాజీ ఎమ్మెల్యే వివరించారు. ముఖ్యంగా హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రాంత రైతులకు శాశ్వత కరువు నివారణలో భాగంగా జీడిపల్లి రిజర్వాయర్ నిర్మించారన్నారు. అయితే రిజర్వాయర్ కిందిభాగాన వున్న జీడిపల్లి గ్రామస్తులు ఊట నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పునరావాసం కల్పించేందుకు అత్యవసర ప్రాతిపదికన రూ.82.12 కోట్లు విడుదల చేయాలని మంత్రికి వివరించి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, పార్టీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, హెచ్. పెద్దన్న, ఫక్రుద్దీన్, గంగాధర్, అక్కులన్న, షణ్ముఖ, రామన్న, బ్రహ్మయ్య, హనుమంతప్ప, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మాజీ ఎమ్మెల్యే విశ్వతో కలసి వినతి ప్రతం అందిస్తున్న జీడిపల్లి గ్రామస్తులు

వివాదంగా మారిన స్థల సమస్య

కుందుర్పి: రెవెన్యూ కార్యాలయానికి సమీపంలో కృష్ణమ్మ గుట్ట వద్ద ఉన్న 10 సెంట్ల ప్రభుత్వ స్థలం తొమ్మిదేళ్లుగా వివాదానికి దారితీయడంతో రెవెన్యూ అధికారులకు తలనొప్పిగా మారింది. 2010లో కురుబ సావిత్రమ్మ కృష్ణమ్మ గుట్ట వద్ద ఉన్న సర్వే నెంబర్ 226లో 5సెంట్ల స్థలానికి పొజిషన్ ఇచ్చారు. అనంతరం ఇదే స్థలానికి సంబంధించి 10సెంట్లకు 2018లో మండల వికలాంగుల సమాఖ్యకు పొజిషన్ ఇచ్చారు అప్పటి రెవెన్యూ అధికారులు. పలుమార్లు అటు సావిత్రమ్మ ఇటు వికలాంగులు ఆ స్థలంలో గుడిసెలు వేసేందుకు ప్రయత్నింగా ఇరువర్గాలు అడ్డుకోవడం కేసులు పెట్టుకోవడం ఏటా జరుగుతూనే ఉంది. నాలుగు రోజులుగా తిరిగి దివ్యాంగులు రెవెన్యూ కార్యాలయం ఎదుట రోజూ నిరసన కార్యక్రమాలు చేపడుతూ పొజిషన్ మేరకు స్థలం చూపాలని కోరుతుండగా తమకు దివ్యాంగుల కంటే ముందు పొజిషన్ ఇచ్చారు. విషయమై కోర్టులో స్టేటస్‌కో తెచ్చాం. తమకు ఐదు సెంట్లు స్థలం చూపాలని సావిత్రమ్మ రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతోంది. ఈ విషయమై తహసీల్దార్ విజయకుమారిని వివరణ కోరగా రెవెన్యూ కార్యాలయానికి దగ్గరగా స్థలం ఉండడంతో ఇరువర్గాలు పోటీపడి రెవెన్యూ అధికారుల ప్రమేయం లేకుండా బండలు పాతడానికి ముందుకు రావడంతో రెండేళ్ల క్రితమే ఇరువరగాల పొజిషన్లను కళ్యాణదుర్గం ఆర్‌డీఓ రద్దు చేశారన్నారు. ప్రస్తుతం ఆ స్థలం ప్రభుత్వ ఆధీనంలో ఉందని తహసీల్దార్ తెలిపారు.

వైస్ ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్

రాయదుర్గం రూరల్: రాయదుర్గం మండలపరిషత్ 1వ ఉపాధ్యక్షుడి ఎన్నికకు ప్రిసైడింగ్ అధికారి రవిశంకర్ రెడ్డి ఆదివారం నోటిఫికేషన్ జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలు, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 8న ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఎన్నిక నిర్వహిస్తామన్నారు. మండల ప్రాదేశిక సభ్యులందరూ తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

బొమ్మనహాళ్/గుమ్మఘట్ట: పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లో టి. శ్రీనివాసులు అనే వ్యక్తికి రూ. 3 లక్షల సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని, పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు ఎంసీహెచ్ రాజ్‌కుమార్, జి.నాయుడు, లక్ష్మీనారాయణ, కృష్ణ, డాక్టర్ బసప్ప, సూర్యప్రతాప్‌రెడ్డి, నాగరాజు, వన్నూరుస్వామి, వీరన్నగౌడ్, నబీసాబ్, ఫోటో బసవరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే గుమ్మఘట్ట మండలకేంద్రంలోని హరిజన సురేష్ కుటుంబసభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద లక్ష రూపాయల చెక్కును విప్ అందించారు. కుటుంబసభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, సర్పంచ్ కోట్ల ఉమేష్, పార్టీ మండల కన్వీనర్ బోయ మంజునాథ , ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, కాంట్రాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ఆర్‌టీ కాంతారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, కె.ఎం.రాజు, చిత్రశేఖరప్ప, అనంతరెడ్డి, రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బొమ్మనహాళ్: సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ఉరవకొండ/వజ్రకరూరు: వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుని విద్యారుథలు విజ్ఞానాన్ని పెంచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ సూచించారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఏప్రిల్ 8 నుంచి ఈనెల 11 వరకు శిక్షణ శిబిరాలను నిర్వహిస్తామని, వీటితో పాటుగా మిగిలిన రోజుల్లో కూడా విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ప్రతాప్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్, శాలిని, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఆమె వజ్రకరూరు గ్రంథాలయాన్ని సందర్శించారు. సమ్మర్ క్యాంపుల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. గ్రంథాలయ అధికారి మునెమ్మ పాఠ కులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూడేరు: విద్యార్థులు చిన్న తనం నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని గ్రంథాలయాధికారిణి రాధారాణి సూచించారు. సమ్మర్ క్యాంపులో భాగంగా ఆదివారం కూడేరు గ్రంథాలయంలో 'భాతర దేశ స్వాతంత్ర సాధనలో సమరయోధుల పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీ నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో సేవా గుణాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండ: మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ

ఆటోను ఢీ కొన్న బైకు

- ముగ్గురికి తీవ్ర గాయాలు





గాయపడిన తిరుమలమ్మ, బోయ చంద్ర

కళ్యాణదుర్గం: రాయదుర్గం వైపు నుంచి కళ్యాణదుర్గం వస్తున్న ఆటోను బైకు ఢీ కొంది. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. శెట్టూరు మండలం బచ్చేహళ్లికి చెందిన బోయ చంద్ర, తిరుమలమ్మ దంపతులతో పాటు నాగభూషణ అనే మరో వ్యక్తి రాయదుర్గం నుంచి స్వగ్రామానికి ఆటోలో వస్తున్నారు. బెళుగుప్ప మండలం రమణేపల్లి వద్దకు రాగానే వెనుక వైపు నుంచి వస్తున్న బైకు అతి వేగంతో వస్తూ ఆటోను ఢీ కొంది. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన 108 వాహనంలో గాయపడిన వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అయితే వెనుక వైపు నుండి ఢీ కొన్న ద్విచక్ర వాహనదారుడు బైకును వదిలి పరారయ్యాడు. ప్రమాద ఘటనపై బెళుగుప్ప పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి ఆక్రమిస్తున్నా పట్టించుకోరా?

బొమ్మనహాళ్: మండలంలోని ఏళంజి గ్రామ పంచాయతీ పరిధిలోని కానాపురం నుంచి సోమలాపురానికి వెళ్లే రోడ్డును ఓ రైతు 150 మీటర్ల మేర తవ్వి తన పొలంలో కలుపుకున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ ప్రాజెక్ట్ పథకం కింద రూ.4 కోట్లతో కానాపురం నుంచి సోమలాపురం వరకూ తారు రోడ్డు వేశారు. సోమలాపురం గ్రామానికి చెందిన రైతు గంగాధరకు ఏళంజి పొలిమేరలో రోడ్డు పక్కన పొలం ఉంది. తన పొలం పక్కన వెళ్లే రోడ్డును 150 మీటర్ల మేర జేసీబీతో తవ్వి పొలంలోకి కలుపుకున్నారని ప్రజలు ఆరోపించారు. ఇక్కడ ఎదురెదురుగా వాహనాలు వస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. రోడ్డును తవ్వి చదును చేసుకుంటున్నా కనీసం పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు వాపోయారు. సంబంధిత అధికారులు పరిశీలించి , రోడ్డు అక్రమణకు గురి కాకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ డీఈ రామమోహన్‌రెడ్డి, మండల పీఆర్ ఏఈ జగదీష్, ఏళంజి వీఆర్‌ఓ బాలాజీనాయక్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.



రోడ్డును తవ్వేసిన దృశ్యం

వైభవంగా సత్యనారాయణస్వామి విగ్రహ ప్రతిష్ట

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీ గ్రామంలో జీర్ణోద్ధారణ చేసిన సత్యనారాయణస్వామి ఆలయంలో నూతన విగ్రహాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా ప్రతిష్టాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో మహాగణతి పూజ, పుణ్యావహవచనం హోమాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం దేవర గోపురకళస్థాపన, గరుడ దేవ ప్రతిష్ట,సంప్రోక్షణ, నాగదేవతల పునఃప్రతిష్టాపన ,పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, మండల కన్వీనర్ బోయ మంజునాథ , ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, కాంట్రాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ఆర్‌టీ కాంతారెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యపై ఘర్షణ

కణేకల్లు: మండలంలోని కణేకల్లు క్రాస్‌లో ఆదివారం సాయంత్రం భూ సమస్యపై ఇరువర్గాలు పరస్పరం కొట్టుకున్నారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కణేకల్లుక్రాస్–యర్రగుంట మార్గమధ్యంలో ఉన్న భూమి సమస్యపై యర్రగుంటకు చెందిన హజరత్, నూరావలి, జక్రీయాలు తమ నుంచి భూమి కొనుగోలు చేసిన కణేకల్లుక్రాస్ చెందిన రవిపై ఘర్షణకు దిగారు. రవి అతని అనుచరుడు నరేష్, హజరత్ వర్గీయులు పరసర్పం కొట్టుకోవడంతో నలుగురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం బళ్లారి విమ్స్‌కు తరలించారు.

మతసామరస్యానికి ప్రతీక షాబాజ్ దివాన్ వలీ ఉరుసు

బొమ్మనహాళ్: మతసామరస్యానికి ప్రతీక అయిన షాబాజ్ దివాన్ వలీ ఉరుసు మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలు ఏటా చాంద్ర మాసం ప్రకారం నిర్వహిస్తారు. షాబాజ్ దివాన్ వలీ ఉత్సవాల్లో భాగంగా సోమవారం గంధం, మంగళవారం దీపారాధన, బుధవారం ఉరుసు, గురువారం జియారత్ ఉంటుందన్నారు. బుధవారం తెల్లవారుజామున మూడు గంటలకు షంషేరు దర్గా నుంచి ఫీతాఫతుల ఆధ్వర్యంలో ఊరేగింపు ఉంటుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రరెడ్డి హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

స్వామి చరిత్ర

ముస్లింలకు మహమ్మద్ ప్రవక్త బోధనలు తెలుపుతూ ప్రజల్లో శాంతి సామరస్యాలు నెలకొల్పుతూ కల్‌హోళ వద్ద ఉన్న ఇసుక దిబ్బలపై షాబాజ్ దివాన్ వలీ దీక్షలో కూర్చునేవారు. స్వామి వద్దకు వెళ్లిన ప్రజలు, భక్తులకు సూక్తులు, హితబోధలు , రోగాలు నయం చేయడం, వారి బాధలను తగ్గించడం లాంటివి చేస్తుండేవారు. బళ్లారి కోట నుంచి పెనుకొండ కోటకు రాయలవారి సైన్యం, వాహనాలు , రథాలు , ఏనుగులు , ఒంటెలు, గుర్రాలతో పాటు సైనికుల వెళుతూ దప్పికకు గురయ్యారు. సైన్యాధిపతులు నీటి కోసం వెతుకుతూ స్వామిని అర్థిచారు. అప్పుడు సైన్యాధిపతిని గుర్రంలో ఒక వైపు వెళ్లాల్సిందిగా స్వామి ఆదేశించారు. గుర్రం వెళుతూ గుర్రం డెక్క దిగడడిన చోట తవ్వమని ఆదేశించారు. గుర్రం మీద వెళుతున్న సైన్యాధిపతి గుర్రం డెక్క ఒక చోట దిగబడటంతో సైనికులతో చెలిమిని తవ్వించారు. అప్పుడు నీరు ఉబికి రావడంతో పాటు సైనికులు, ఏనుగులు, గుర్రాలు , ఒంటెలు కడుపునిండా నీర తాగాయి. అప్పటి నుంచి చెలిమి ఇప్పటి వరకూ అలాగే ఉంది. రోజూ అందులో నీటిని తీసుకోని ప్రజలు వెళుతున్నారు. చుట్టు ఒక కిలోమీటర్‌లోపు ఎక్కడ బోర్లు వేసినా నీరు పడటం లేదని రైతులు తెలిపారు. ఇది స్వామివారి మహత్యమని రైతులు, భక్తులు చెలిమి నుంచి సీసాలు , బాటిళ్ల ద్వారా నీటిని తీసుకెళుతుంటారు.



షాబాజ్ దివాన్ వలీ సమాధి

కల్‌హోళలో సమాధి

ఇసుకదిబ్బలపైనే దీక్ష చేస్తున్న స్వామివారిని ముస్లింలు, గ్రామస్తులు గ్రామంలోకి ఆహ్వానించారు. గ్రామంలోనే ఉండి ప్రజల సుఖశాంతులు కోరుతూ శాంతిబోధనలు చేయాలని కోరడంతో స్వామివారు కల్లహోళ గ్రామంలో జీవనం సాగించారు. అనంతరం ప్రజల్లో శాంతి సమరస్యాలు నెలకోల్పుతూ, భక్తిప్రవచనాలు, ప్రబోధలు చేస్తూ పరమపదించారు. అప్పటి నుంచి స్వామి గుర్తుగా ఉరుసు మహోత్సవాన్ని ఏటా భక్తులు నిర్వహించుకుంటున్నారు.